బస్ ఎక్కాలంటే కష్టమే

- బస్సులకు అడ్డంగా ఆటోలు, ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాలు
- శ్రీకాకుళం, విజయనగరం, ఒడిశా వైపు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు
- మధురవాడ, కొమ్మాది, తగరపువలస వెళ్లేందుకూ అవస్థలే
- కూడలిలో కనిపించని ఆర్టీసీ సిబ్బంది



జాతీయ రహదారిపై హనుమంతవాక బస్టాప్ వద్ద ప్రయాణికులు

ఆరిలోవ : హనుమంతవాక కూడలి వద్ద బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు పాట్లు పడాల్సి వస్తోంది. ఇక్కడ బస్ ఎక్కాలంటే ముందున్న ఆటోలను దాటాల్సి వస్తోంది. బస్‌లు వెళ్లేవరకు ఆటోలు తీయడం లేదు. దీంతో ప్రయాణికులు బస్‌లు ఎక్కలేక ఇబ్బంది పడుతున్నారు. మధురవాడ, కొమ్మాది, ఆనందపురం, తగరపువలస వైపు ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీలు చాలా ఎక్కువ ఉన్నాయి. ఆయా కళాశాలలకు వెళ్లడానికి ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు జాతీయ రహదారిపై హనుమంతవాక వద్ద బస్టాప్ రద్దీగా మారుతుంది. ఆయా కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఎక్కువ మంది సిటీ బస్‌లను ఆశ్రయిస్తున్నారు. విశాలాక్షినగర్, ఆరిలోవ, పైనాపిల్‌కాలనీ, చినగదిలి, పెదగదలి, రవీంద్రనగర్, ఆదర్శనగర్, డెయిరీఫారం నుంచి వందల మంది విద్యార్థులు బస్‌లు కోసం ఇక్కడి స్టాప్ వద్దకు చేరుకొంటున్నారు. వీరితోపాటు శ్రీకాకుళం, విజయనగరం, ఒడిశా వెళ్లే ఆర్టీసీ లైన్ బస్‌లు అన్నింటికీ ఇక్కడ స్టాప్ ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు కూడా ఇక్కడ స్టాప్ వద్దే బస్‌లు ఎక్కుతారు. దీంతో కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులతోపాటు అటు విజయనగరం, పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి, రాయగడ, జైపూర్, ఇటు శ్రీకాకుళం, పాలకొండ, టెక్కలి, ఇచ్ఛాపురం వరకు వెళ్లాల్సిన ప్రయాణికులు హనుమంతవాక బస్టాప్ వద్దకు చేరుతున్నారు. దీంతో ఈ స్టాప్ ఉదయం సమయంలో రద్దీగా మారుతుంది.

ప్రయాణికులకు అడ్డంగా ప్రైవేట్ వాహనాలు

రద్దీ సమయంలో బస్‌ల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులకు ఆటోలు, మ్యాక్సీలు, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అడ్డంకిగా మారుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల మధ్యలో ఎక్కువగా వీటితో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సిటీ బస్‌లు, లైన్ బస్‌లు బస్టాప్ వద్ద షెల్టర్ల ముందు ఆగాల్సి ఉంది. ఆ బస్‌ల కంటే ముందుగానే ఆటోలు, ప్రైవేట్ బస్‌లను కొందరు ఆ స్టాప్ ముందు నిలుపుతున్నారు. ఆ సమయంలో వచ్చే బస్ ఎక్కడానికి ప్రయాణికులు వీటిని దాటుకొంటూ వెళ్లాల్సి వస్తోంది. ఈ లోగా బస్‌లు లాగించేస్తున్నారు. మరికొంత సమయం తర్వాత రానున్న మరో బస్ కోసం వేచిచూడాల్సి వస్తోంది. దీంతో ఆ బస్‌లు ఎక్కలేక సకాలంలో కళాశాలలకు వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ లైన్ బస్‌లు ఎక్కడానికి కూడా ఇదే సమస్య. ముందు వచ్చే బస్ ఎక్కడానికి ఆటోలు, ప్రైవేట్ ట్రావెల్స్ అడ్డంగా ఉండటంతో కళ్ల ముందు ఉన్న బస్ ఎక్కలేక పోతున్నామని, మరో బస్ కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు మండి పడుతున్నారు.

కూడలిలో కానరాని ఆర్టీసీ సిబ్బంది

నిత్యం రద్దీగా ఉండే హనుమంతవాక బస్టాప్ (మధురవాడ వైపు వెళ్లడానికి) వద్ద ఆర్టీసీ సిబ్బందిని నియమించాల్సిన అవసరముంది. అయితే ఇక్కడ రద్దీ సమయంలో సిబ్బంది ఎవ్వరూ కనిపించడం లేదు. దీంతో ప్రైవేట్ వాహనాలకు అడ్డు లేకుండాపోతోంది. కీలకమైన ఇక్కడి బస్టాప్ వద్ద బస్‌లు మాత్రమే ఆగేలా చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రయాణికుల రద్దీ సమయంలో ప్రైవేట్ వాహనాలు బస్టాప్ వద్ద ఆగకుండా కొంత దూరంలో నిలుపుకొనే విధంగా చర్యలు చేపడితే ఆర్టీసీకి లాభం కూడా వస్తుంది. అక్కడ వేచి ఉండే ప్రయాణికులు ఆర్టీసీ బస్‌లు మాత్రమే ఎక్కగలుగుతారు. వాటి వల్ల సంస్థకు ఆదాయం కూడా లభిస్తుంది. ప్రయాణికుల కష్టాలూ తీరుతాయి. ప్రస్తుతం బస్‌లు ఎక్కలేకపోవడం వల్ల విసిగిపోయిన ప్రయాణికులు ట్రావెల్ బస్‌లు, మ్యాక్సీలు, ఆటోలు ఎక్కడంతో ఆర్టీసీ ఆదాయానికి గండిపడుతోంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ఇక్కడ ప్రైవేట్ వాహనాలను నియంత్రించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



హనుమంతవాక కూడలిలోని బస్టాప్ వద్ద బస్సులు ఆగడానికి వీలు లేకుండా అడ్డంగా నిలిపిన ఆటోలు, మ్యాక్సీలు

క్లుప్తంగా

నష్ట పరిహారం నగదు రూపంలో చెల్లించాలి


వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

విశాఖ సిటీ : అనకాపల్లి నుంచి అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు, షాపులు కోల్పోతున్న నిర్వాసితులకు నగదు రూపంలో నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బాధితులకు టీడీఆర్ బాండ్లు వద్దని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని కోరుతూ సోమవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం కార్పొరేటర్ బొడ్డు గంగారావు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో ఇళ్లు పూర్తిగా పోతున్న వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఆర్ అండ్ బీ రోడ్డు పరిధిలో చిల్లర వ్యాపారం ద్వారా జీవనం పొందుతున్న వారిని నిర్వాసితులుగా పరిగణించి ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. 100 అడుగుల తర్వాత ఇళ్ల నిర్మాణాలకు ఎటువంటి నిబంధనలు పెట్టకూడదన్నారు. అనంతరం ఆయనతోపాటు నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్.రాము, కో కన్వీనర్ కె.రామ సదాశివరావు, రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, బాబూరావు తదితరులు వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేశారు.

కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ ఆవిష్కరణ


ట్రోఫీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

ఎంవీపీ కాలనీ : సూపర్ కిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇన్విటేషన్ ఏపీ స్టేట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ - 2025 పోటీల ట్రోఫీని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్ - 4లోని ఆయన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. పోటీలు ఈ నెల 10న ఏయూ ఇండోర్ స్టేడియంలోని కిక్ బాక్సింగ్ రింగ్ వేదికగా జరగనున్నట్లు సంస్థ ఛైర్మన్ పి.శ్రీనివాస్ వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సూపర్ కిక్స్ క్లబ్ ప్రతినిధులు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


నీలాపు వెంకటరమణ

అల్లిపురం: విధులకని వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆరిలోవకు చెందిన నీలాపు వెంకటరమణ జీవీఎంసీ స్వీపర్‌గా డాబాగార్డెన్స్ ప్రాంతంలో పనిచేస్తుంటాడు. జూలై 19న విధులకు హాజరయ్యేందుకు డాబాగార్డెన్స్ మహిళా కళాశాల వెనుక వీధిలోకి వెళ్లాడు. ఆ రోజు నుంచి తిరిగి ఇంటికి రాకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నీలాపు వెంకటరమణ 5 అడుగుల ఎత్తు కలిగి, నలుపు రంగులో ఉంటాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 70934 83898, 94409 04716 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో డీఆర్‌ఎం ఆకస్మిక తనిఖీలు


టీటీఈ రెస్ట్ హౌస్‌లో తనిఖీలు చేస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: ఉద్యోగులు, సిబ్బంది భద్రత, సంక్షేమం కోసం కృషి చేస్తూ రాత్రి వేళల్లో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు డీఆర్‌ఎం లలిత్ బోహ్రా ఆదివారం అర్ధరాత్రి విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. టీటీఈ రెస్ట్ హౌస్, బుకింగ్ కార్యాలయంతోపాటు హెరిటేజ్ రిటైరింగ్ రూంలు, స్లీపింగ్ పాడ్స్ వంటి ప్రాంతాల్లో సిబ్బంది వసతులు, ప్రమాణాలను పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో సిబ్బందితో డీఆర్‌ఎం ముఖాముఖి మాట్లాడారు. తనిఖీల వల్ల వాస్తవ పరిస్థితులను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

‘సూపర్ సిక్స్’ హామీలు గాలికొదిలేశారు

- తూతూమంత్రంగా ఉచిత గ్యాస్, తల్లికి వందనం అమలు
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు


23వ వార్డులో చంద్రబాబు మోసాలు వివరిస్తున్న మొల్లి అప్పారావు


జీవీఎంసీ పదో వార్డు పరిధి ఆదర్శనగర్‌లో మహిళకు కరపత్రం అందిస్తున్న మొల్లి అప్పారావు

ఆరిలోవ : సాధారణ ఎన్నికల్లో కూటమి పార్టీల నాయకులు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చకుండా వదిలేశారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ పదో వార్డులో సోమవారం నిర్వహించిన ‘బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ’ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు, స్థానిక నాయకులతో కలిసి వార్డులోని ఆదర్శనగర్ 73వ బూత్ పరిధిలో ఆయన గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం వైఫల్యాలు ప్రజలకు తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అరాచకాలను వివరించారు. చంద్రబాబు మోసాలపై వైఎస్సార్‌సీపీ ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కూటమి ప్రభుత్వం మాయ మాటలతో కాలం గడుపుతోందన్నారు. ఎన్నికల సమయంలో చెప్పినట్లు మహిళలకు ఉచిత బస్ ప్రయాణం హామీ అమలు చేయకుండా ఊరిస్తున్నారన్నారు. ఇంకొన్ని తూతూమంత్రంగా అమలు చేస్తున్నారన్నారు. ఇంటికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు కొందరికే పరిమితమయ్యాయన్నారు. తల్లికి వందనం నిధులు వేల మంది విద్యార్థుల తల్లులకు అందించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కె.ఆర్.పాత్రుడు, నాయకులు వైదా నారాయణరావు, బొండా శ్రీను, కనకల కృష్ణ, పతివాడ వెంకటలక్ష్మి, వరలక్ష్మి, రామారావు, తులసి, రవీంద్ర, హరిబాబు, గురునాయుడు, ఆనంద్, శ్రీను, నారాయణమ్మ, రాధ, కనక, కుమారి, శారద, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు

మద్దిలపాలెం : కల్లబొల్లి కబుర్లతో, ఆచరణ సాధ్యం కాని హామీలతో మోసం చేసిన చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా వున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ 23వ వార్డు 248, 257 బూతుల పరిధిలో ‘బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ’ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒక్కొక్కటి చొప్పున కొందరికే ఇచ్చారన్నారు. ఉచిత బస్సుల్లో ప్రయాణంపై కూడా స్పష్టత లేదన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయన్నారు. ప్రస్తుతం బాబు పాలనలో ప్రజలంతా అసంతృప్తి చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు పరిశీలకులు బోర కుమార్ రెడ్డి, అధ్యక్షుడు బాస రమణారెడ్డి, ఇన్‌చార్జి పులగం సూర్యనారాయణ రెడ్డి, నాయకులు ఎండ్రెడ్ల ఈశ్వరరావు రెడ్డి, పిలక మధుసూదన్ రెడ్డి, పులగం.శ్రీనివాస్ రెడ్డి, ఎందిరెడ్ల.ఈశ్వర్ రెడ్డి, పులగం.కొండ రెడ్డి, పిలక.మధుసూదన్, కేవీ రమణ, పులగం.సూర్యనారాయణ, శ్రీనివాస్‌రావు, బోయ.రమణ రెడ్డి, గుమ్మడి.మణి, సరగడ.రవణమ్మ, పూట రమణమ్మ, సుధీర్ రెడ్డి, రమణ రెడ్డి, కోయ.శశికళ, చిన్ని, బోయ.త్రినాథ్, చిల్ల నారాయణరావు పాల్గొన్నారు.

ఇంటింటికీ కూటమి ప్రభుత్వ మోసాలు


భానోజీనగర్‌లో మహిళలతో కలిసి కరపత్రాలు చూపుతున్న పల్లా దుర్గారావు, నాయకులు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డు భానోజీనగర్ పరిధి బూత్ నంబర్ 195, 196లో ‘బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ’ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ బూత్ అధ్యక్షులు కొండ్రు అప్పారావు, అడపాక మునీంద్రనాథ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నేటికీ పథకాలు అమలు చేయలేదని, మాయ మాటలతో మోసం చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో తెలుగు వాణి, మున్నప్ప ఈశ్వరి, సోమధుల అప్పలరాము, బోనుల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

యూజీ రీసెర్చ్ కౌన్సిల్ ఏర్పాటుకు చర్యలు


కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం : పోటీ ప్రపంచంలో విజేతగా మారాలంటే విద్యా సంబంధిత అంశాల్లో రాజీ పడొద్దని... ప్రతిభ చూపాల్సిన అవసరం ఉందని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. బీచ్‌రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఇంజినీరింగ్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు భవిష్యత్‌లో పరిశోధన రంగంలో రాణించే దిశగా తీర్చిదిద్దడం కోసం ప్రత్యేకంగా యూజీ రీసెర్చ్ కౌన్సిల్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థులు నాలుగేళ్ల తర్వాత తాము పొందాలనుకునే భవిష్యత్ కోసం ప్రణాళిక తయారు చేసుకుని నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నూతన కరికులం తయారుచేసి అమలు చేస్తున్నామని చెప్పారు. అదే సమయంలో విద్యార్థులను తల్లిదండ్రులు నిరంతరం పరిశీలించాలని సూచించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ 8 వేల మంది విద్యార్థులతో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల దేశంలోనే అత్యుత్తమ కళాశాలల్లో ఒకటిగా నిలుస్తోందని చెప్పారు. 14 బీటెక్ కోర్సులను, 27 ఎంటెక్ కోర్సులను 17 విభాగాల ద్వారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ర్యాగింగ్ రహితంగా ఇంజినీరింగ్ కళాశాలను తీర్చిదిద్దామని వివరించారు. మెరుగైన ఉపాధి అవకాశాలతోపాటు, స్టార్టప్, విదేశాల్లో ఉన్నత విద్యకు తమ విద్యార్థులు వెళ్లడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

ఫుట్‌బోర్డుపై ప్రమాదకర ప్రయాణం


సిటీ బస్ ఫుట్‌బోర్డుపై వేలాడుతున్న విద్యార్థులు

ఆరిలోవ : విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ప్రమాదకరంగా ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేస్తున్నారు. ఆ ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా గాలిలో వేలాడుతూ ఎంజాయ్ చేస్తున్నారు. బస్సుల లోపల ఖాళీ ఉన్నప్పటికీ చాలా మంది ఇలా వేలాడుతున్నారు. పుస్తకాలు, క్యారేజీ బ్యాగు వీపుపై వేసుకుని ఫుట్‌బోర్డుపై నిల్చుంటున్నారు. బస్టాప్‌ల వద్ద ఆగిన బస్సులలోకి ఇతర ప్రయాణికులు ఎక్కడానికి సైతం వీలుకాకుండా అడ్డంగా ఉంటూ ఆటంకం కలిగిస్తున్నారు. ప్రమాదకర విధంగా నిలబడడంతోపాటు మరో పక్క తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. అలాంటి ప్రయాణం మంచిది కాదని, వారి ప్రాణాలతో వారే చెలగాటం ఆడుకోవడమేనని పలువురు ఆవేదన చెందుతున్నారు. విద్యార్థులు వారి భవిష్యత్ కోసం వారే ఆలోచించాలని సూచిస్తున్నారు. ఫుట్‌బోర్డుపై ప్రయాణం మానుకోవాలని హితవు పలుకుతున్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన తనిఖీల్లో ఓ నిందితుడిని అదుపులోకి తీసుకుని, 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ పి.శివనారాయణ స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం గుణుపూర్‌కు చెందిన ప్రదీప్ దులిబస్కు విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.50 వేల విలువైన 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు.

ఎన్‌సీసీ శిక్షణతో భవితకు నిచ్చెన


‘బి’ సర్టిఫికెట్లతో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లకు సోమవారం ‘బి’ సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందిన 19 మందికి ప్రిన్సిపాల్ డాక్టర్ అర్.మంజుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ యువతకు శారీరక, మానసిక స్థైర్యాన్ని పెంపొందించే గొప్ప వేదకని అన్నారు. ‘బి’ సర్టిఫికెట్ విద్యార్థుల కెరీర్‌కు పునాది వేసే ముఖ్య అడుగని క్యాడెట్లను అభినందించారు. ఎన్‌సీసీ క్యాడెట్ల సేవా భావం, క్రమశిక్షణ, జాతీయతతో కళాశాల గౌరవాన్ని పెంచాలని కాలేజీ ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ కె.గీతాంజలి ఆకాంక్షించారు. కార్యక్రమంలో డి.అరుణపద్మ, డాక్టర్ ఆర్.కిరణ్మయి, ఎల్.శరణ్య, క్యాడెట్లు పాల్గొన్నారు.

250 అడుగుల జెండా వితరణ

సీతంపేట: రోటరీ క్లబ్ విశాఖ స్మార్ట్ సిటీ 250 అడుగుల పొడవైన జాతీయ జెండాను సోమవారం అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌కు అందజేసింది. క్లబ్ అధ్యక్షుడు వేణు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ రవికుమార్, మెంబర్ సురేష్ చేతుల మీదుగా పాఠశాల హెచ్‌ఎం జయంతి రాధా కుమారికి జెండాను అందజేశారు.
ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ 250 అడుగుల జాతీయ పతాకాన్ని తమ స్కూల్‌కు రోటరీ క్లబ్ అందజేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆగస్టు 15, రిపబ్లిక్ డే వంటి ముఖ్య దినాల్లో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తామని, పిల్లల్లో దేశభక్తి పెంపొందించడానికి పలు కార్యక్రమాలు రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం, పీడీ రత్నం, పేరెంట్ కమిటీ ఛైర్మన్ అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళల భద్రతకు చర్యలు

- వాల్తేర్ డివిజన్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం


రైల్వే మహిళా గ్యాంగ్‌కు భద్రతపై అవగాహన కల్పిస్తున్న టీం సభ్యులు

తాటిచెట్లపాలెం: పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులకు భద్రతతో కూడిన గౌరవప్రదమైన వాతావరణం కల్పించేందుకు వాల్తేర్ డివిజన్ సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం ప్రారంభించింది. డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ అన్సారీల నేతృత్వంలో ఈ బృందం సిబ్బందిపై లైంగిక వేధింపులు, హక్కులు, విధుల గురించి అవగాహన కల్పిస్తారు. ప్రతి ఉద్యోగికి ప్రత్యేకంగా మహిళా ఉద్యోగులకు ఎటువంటి భయం, ఆందోళన లేకుండా చేయడమే వాల్తేర్ డివిజన్ లక్ష్యమని డీఆర్‌ఎం లలిత్ బోహ్రా ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నాలుగు నిబద్ధత గల కమిటీలు ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇవి డివిజన్ పరిధిలోని ఆయా రైల్వే స్టేషన్లు, పని చేసే ప్రదేశాల్లో పర్యటించి మహిళా ఉద్యోగులకు వారి విధుల్లో ఎదురయ్యే లైంగిక వేధింపులపై పలు కీలక సూత్రాలను తెలియజేస్తారన్నారు. ఈ బృంద సభ్యులు మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ వేధింపుల సమయంలో ఎలా ఎదుర్కోవాలో వివరిస్తారని చెప్పారు. అవగాహన కార్యక్రమాలు, సెమినార్లు, ముఖాముఖి కార్యక్రమాలు వంటివి అన్ని విభాగాల్లోనూ నిర్వహిస్తారని పేర్కొన్నారు. బాధితుల పక్షాన నిలబడి, ఫిర్యాదుల నమోదులో వారికి అవసరమైన సహాయం చేస్తారని తెలిపారు. తొలి రోజు పలు రైల్వే స్టేషన్లలో రైల్వే మహిళా గ్యాంగ్‌కు పని ప్రదేశాల్లో లైగింక వేధింపులను ఎదుర్కోవడంపై టీం సభ్యులు అవగాహన కల్పించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి తగరపువలసకు చెందిన ఉప్పాడ బాల ఆదిత్యరెడ్డి రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో సోమవారం అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు ఈవో వి.త్రినాథరావు బాండ్ అందించారు. నగరంలోని మహారాణిపేటకు చెందిన కె.సూర్యప్రకాశరావు, శ్రీలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందించారు.